సాక్షి బాపట్ల

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



భక్తి సంగీత విభావరి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తి గీతాలాపన జరిగింది. పరమేశ్వరి, సాయిబాబు, పోతురాజు గీతాలను ఆలపించారు.



భక్తి శ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు.

శివాలయంలో నందీశ్వరుడి పూజ



నాదెండ్ల: గణపవరం గంగాపార్వతీ సమేత సోమేశ్వరాలయంలో శనివారం నందీశ్వరుడి పూజ నిర్వహించారు. అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

దేవీ శరన్నవరాత్రుల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : ఈ నెల 22 నుంచి చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో 22వ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. దేవస్థానంలో శనివారం మహోత్సవాల గోడప్రతులను కమిటీ సభ్యులతో కలసి ఆమె ఆవిష్కరించారు. వచ్చేనెల రెండో తేదీ వరకు ఉత్సవాలు జరగుతాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అడకా పద్మావతి, తుమ్మల నాగేశ్వరరావు, కుమ్మర క్రాంతి కుమార్, అంగడి శ్రీనివాసరావు, అడకా శ్రీనివాసరావు, పెద్ద బుజ్జి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంలో ఎన్జీఓలదే కీలకపాత్ర

అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ



నరసరావుపేట టౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఎన్జీఓ సంఘాల ప్రతినిధులతో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్య శ్రీ శనివారం కోర్టు ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు, బాలికల అక్రమ రవాణా నిర్మూలనకు ఎన్జీఓలు అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. సీనియర్ సిటిజన్లకు అన్ని విధాలైన సహాయ సహకారాలు అందించాలన్నారు. హెచ్ఐవీ నిర్మూలనకు, ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణకు ఎన్జీవోలు తగు చర్యలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ ఎన్జీఓల ప్రతినిధులు హృదయ రాజు, మీరా, డేవిడ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. మొదట న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శనివారం రాత్రి ఉరుములతో భారీ వర్షం కురిసింది. నగర ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అరండల్‌పేటలో పైపులైను కోసం తవ్విన గుంతల పక్కన మట్టి రోడ్డుపైనే ఉండటంతో వర్షం నీటితో చిత్తడిగా మారింది. పలువురు పాదచారులు, వాహన చోదకులు జారిపడి గాయపడ్డారు. డొంకరోడ్డులో మూడు వంతెనల వద్ద వర్షపునీటితో రాపోకపోలకు అంతరాయం ఏర్పడింది. కంకరగుంట అండర్ పాస్ పూర్తిగా నీటి మయం కావడంతో అక్కడ భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

కార్తికేయుని సేవలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు, డాక్టర్ లీలా రమాదేవి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి ప్రతిష్ట తగ్గించేందుకే విజయవాడ ఉత్సవ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మ సన్నిధిలో జరిగే దసరా ఉత్సవాలను అపహాస్యం చేయటానికి, అమ్మవారి ప్రతిష్టను, ఖ్యాతిని తగ్గించడానికి కూటమి నేతలు విజయవాడ ఉత్సవ్ పేరుతో అడ్డగోలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ శనివారం విమర్శించారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో రూ.100 కోట్లు దోచుకోవడానికి ఎంపీ కేశినేని చిన్ని తదితర నేతలు పథకం పన్నారని దుయ్యబట్టారు.

పత్రికా స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు



ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే పత్రికా స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు. ఏ మీడియాకు లేని ఆంక్షలు ఒక్క 'సాక్షి'కే ఎందుకు వర్తిస్తాయో కూటమి సర్కారు జవాబు చెప్పాలి. వాస్తవాలు రాస్తున్నారని ద్వేషమా? నిజాలు నిర్భయంగా వెల్లడిస్తున్నారనే ఆక్రోశంతో చంద్రబాబు, లోకేష్‌లు రగిలిపోతున్నారు. విలేకరుల సమావేశంలో కూటమి కుట్రల గురించి ప్రస్తావిస్తే.. 'సాక్షి' పై.. ఎడిటర్‌పై కేసులు కట్టడం ఎంతవరకు సమంజసం అనే విషయాన్ని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఆలోచించాలి. నిస్సిగ్గుగా మేం ఏం చేసినా అడిగేవాడు లేడన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కేసులు పెట్టి కలాన్ని, పాత్రికేయులను నిలువరించలేరు. ఈ వాస్తవాన్ని కూటమి సర్కారు ఇప్పటికైనా గ్రహించాలి.

– పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



అక్రమ కేసులు దారుణం



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తుందనే 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ప్రభుత్వ చర్యలు, తప్పులను పత్రికలు ఎత్తిచూపడాన్ని పాలకులు ఓర్చుకోలేకపోవడం సరికాదు. ఫోర్త్ పిల్లర్‌గా పిలవబడే మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం కంటే నిరంకుశత్వం ఇంకేముంది? పోలీసు అధికారుల హక్కులను కాపాడేందుకే రాసిన కథనంపై 'సాక్షి'పై అక్రమ కేసు పెట్టడం విడ్డూరంగా వుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియా రంగాన్ని కూటమి ప్రభుత్వం అణిచివేసేలా చర్యలు చేపట్టడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు.

– మున్నంగి వివేకానందరెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు

రైతుల నెత్తిన ఎరువు బరువు

- ఎమ్మార్పీ కంటే అధికంగా వ్యాపారుల విక్రయం
- వ్యయసాయానికి భారీగా పెరిగిన పెట్టుబడులు
- కూటమి ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అంతంతే
- ఏ పంటకీ గిట్టుబాట ధర లభించక తీవ్ర నష్టాలు

కూటమి పాలనలో ఎరువుల ధరలు భగ్గుమంటున్నాయి. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుకుంటూ పోతుండటంతో మోయలేని భారం వారిపై పడుతోంది. పెట్టుబడి సాయం అంతంత మాత్రం అందడం, గిట్టుబాటు ధర లేక నష్టాల పాలవుతున్నారు. గత ఏడాది వరి, పొగాకు, శనగ, మిర్చి, పత్తి రైతులు భారీగా నష్టాలు చవి చూశారు. ఇప్పుడు ఎరువుల ధరలు పెరగడంతోపాటు బస్తాకు అదనంగా వ్యాపారులు కూడా దోచుకుంటున్నారు. కూటమి సర్కార్ తీరుపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది కాలంలో పలుమార్లు పెరిగిన ధరలు



గోదాములో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఎరువులు

వేటపాలెం చీరాల నియోజకవర్గ పరిధిలో దాదాపు రెండు లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో ప్రధానంగా వరి, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేస్తుంటారు. గత ఏడాది వరికి మద్దతు ధర రాక పోవడంతో రైతులు నష్టాల బాట పట్టారు. తీరా పంట చేతికి వచ్చే సరికి ధాన్యానికి ధరలేక దళారులకు తక్కువ ధరలకే విక్రయించుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎకరా సాగు చేయడానికి రూ. 35 వేలు నుంచి రూ. 40 వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ ఏడాది ఎరువులు, కూలీ ధరలు పెరడంతో సాగు ఖర్చులు మరో రూ.5 వేలు పెరిగే అవకాశం ఉంది.

ఎరువుల ధరల వివరాలు (రూ.లలో)

రకం	పాత ధర	కొత్త ధర
20-20-0	1250	1350
10-26-26	1470	1850
15-15-15	1450	1650
14-15-14	1700	1850
పొటాష్	1550	1800
28-28	1700	1850
20-20-0-13	1300	1450
24-24	1700	1850
డీఏపీ	1350	1350
యూరియా	266	270

ధరలు తగ్గించాలి

పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి. ఒక వైపు రైతులకు సాగు ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. పండించిన పంటకు గిట్టు బాటు ధరలు లేకుండా పోయాయి. గోటి చుట్టుపై రోకటి పోటులా ప్రభుత్వాలు ఎరువుల ధరలు పెంచడం దారుణం. రైతుల పరిస్థితి దీనంగా మారింది. వ్యవసాయం చేయడం కష్టంగా ఉంది.

– నాయుడు, వేటపాలెం

సాగు ఖర్చులు పెరిగాయి

ఎరువుల ధరలతోపాటు కూలి, వ్యవసాయ యంత్రాల బాడుగ ధరలు పెరిగాయి. దీంతో వ్యవసాయం చేయడం కష్టంగా మారింది. సాగు చేసే కంటే కూలి పనులకు వెళ్లడం నయం అన్నట్లు పరిస్థితి నెలకొంది. ఉన్న భూమిని వదులుకోలేక వ్యవసాయం చేస్తున్నాం. 90 శాతం మంది రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తున్నారు.

– రామకృష్ణ, రైతు, వేటపాలెం

నాడు అందుబాటులో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 – 24 వరకు ఎరువుల ధరలు నిలకడగా ఉన్నాయి. వ్యాపారుల నుంచి రైతులను కాపాడేందుకు ఆర్‌బీకేలను అప్పటి పాలకులు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిర్వీర్యం చేసింది. యూరియా సక్రమంగా అందించలేని దుస్థితిలో ప్రస్తుత సర్కార్ ఉంది.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ ఈ ఏడాది దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మహామండపం ఆరో అంతస్తులో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, మునిసిపల్ కమిషనర్ ధాన్యచంద్ర, దుర్గగుడి ఈఓ శీనానాయక్ హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. సామాన్య భక్తుల రద్దీ తక్కువగా ఉండే సమయంలోనే వీఐపీ దర్శనాలను స్లాట్లు నిర్ణయించామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణకు ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి ఒక అధికారి చొప్పున నియమించామని తెలిపారు. ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేశామని వివరించారు. నగరంలో 20 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

'బీచ్ ఫెస్ట్'లో నిధుల పితలాటకం

- ఫెస్టివల్ బాధ్యతలు జిల్లా అధికారులకు
- ప్రభుత్వ నిధులు రూ.4కోట్లు ఈవెంట్ కంపెనీకి..
- అధికారులకు పైసా బడ్జెట్ ఇవ్వని ప్రభుత్వం
- అదనంగా రూ. 3 కోట్లు పైనే ఖర్చయ్యే అవకాశం
- స్పాన్సర్‌షిప్ పేరుతో వసూలు చేసుకోవాలని ప్రభుత్వం సూచన
- తలలు పట్టుకుంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తీరంలో జరగనున్న బీచ్ ఫెస్టివల్ వ్యవహారం జిల్లా అధికారుల తలకు చుట్టుకుంది. ఈనెల 26,27,28 తేదీల్లో జరగనున్న ఈ పండుగకు రూ. 4 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఫెస్టివల్ నిర్వహణ బాధ్యతలు ఢిల్లీకి చెందిన ఈ ఫ్యాక్టర్ ఈవెంట్ కంపెనీకి కట్టబెడుతున్నట్లు సమాచారం. దీంతో సుమారు రూ.7కోట్లకు పైగా ఖర్చయ్యే బీచ్ ఫెస్టివల్‌లో మిగిలిన ఖర్చు ఎవరు భరించాలన్నదానిపై అధికార వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. గ్రాండ్‌గా బీచ్ ఫెస్టివల్ చేయాలంటే సుమారు రూ. 9 కోట్ల వరకూ ఖర్చవుతుందని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేసింది. ఒక మోస్తరుగా చేయాలన్నా రూ. 7కోట్ల నుంచి 8 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఇదే విషయాన్ని జిల్లా అధికారులు ఏపీ టూరిజంతోపాటు ప్రభుత్వానికి నివేదించారు. అయినాసరే తాము ఇచ్చేది కేవలం రూ. 4 కోట్లు మాత్రమేనని, మిగిలిన మొత్తాన్ని చందాలు వసూలు చేసుకోవాలని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

రూ.4కోట్లకే సై..!

ప్రభుత్వం ఈ ఫెస్టివల్‌కు కేవలం రూ.4కోట్లు మాత్రమే కేటాయించినా.. నిర్వహణకు అప్పటి కలెక్టర్ వెంకట మురళి సై అన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు విషయం తెలిపి సహకరించాలన్నారు. అధికార యంత్రాంగాన్ని కూర్చోబెట్టి ఏఏ వర్గాలతో చందాలు వసూలు చేయవచ్చో ఆరా తీశారు. వారి సలహాతో గ్రానైట్, ఇసుక వ్యాపారులతో మొదలు రిసార్ట్‌లు, హోటల్స్, ఆక్వా, మద్యం వ్యాపారులు, మెడికల్ అసోషియేషన్ వారికి చందాలు రాశారు. దీనిపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని స్పాన్సర్‌షిప్ పద్ధతిలోకి మార్చారు. ఇంతలో కలెక్టర్ వెంకట మురళి బదిలీపై వెళ్లి పోయి ఆయన స్థానంలో వినోద్ కుమార్ నూతన కలెక్టర్‌గా వచ్చారు. పాత కలెక్టర్ తరహాలో కొత్త కలెక్టర్ స్పాన్సర్‌షిప్ పద్ధతిలో మిగిలిన మొత్తాన్ని వసూలు చేస్తారా? లేక మరో పద్ధతి అవలంభిస్తారా? అన్నది వేచి చూడాల్సివుంది.

ఈవెంట్ కంపెనీకి అప్పగించడంపై గరం గరం

ఫెస్టివల్‌కు పెద్దపెత్తున ప్రజలు, పర్యాటకులు తరలివచ్చే అవకాశముంది. వీరందరికీ తాగునీరు అందించడం, మొబైల్ టాయిలెట్స్, పార్కింగ్, శానిటేషన్, లైటింగ్, సిబ్బందికి భోజనాలు ఇతర వ్యవహారాలను మొత్తం జిల్లా అధికార యంత్రాంగం చూడాలట. అందుకు సంబంధించి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించారా? అంటే అదీలేదు. ఆ మొత్తాన్ని చందాలరూపంలో వసూలు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది. బీచ్ ఫెస్టివల్ తమ చేతులమీదుగా జరిపించడం శ్రమైనా సంతోషంగా చేయగలుగుతామని, కార్యక్రమాన్ని ఢిల్లీకి చెందిన ఈవెంట్ కంపెనీకి కేటాయించడం, నిధులు అరకొర కేటాయించి, మిగిలినవి చందాల రూపంలో వసూలు చేయండని ప్రభుత్వం ఆదేశించడంపై అధికార వర్గాలు ఆగ్రహిస్తున్నాయి. ప్రభుత్వం ఈవెంట్‌ను కాంట్రాక్టర్లకు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇందులో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారి ఉండవచ్చని ప్రచారంసాగుతోంది. ప్రభుత్వం కేటాయించిన డబ్బులు మొత్తం ఈవెంట్ కంపెనీకి ఇచ్చి మిగతా ఖర్చులను స్పాన్సర్ల పేరున వసూలు చేయాలని చెప్పడం సరికాదన్నది అధికార వర్గాలనుంచి వస్తున్న విమర్శ.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



పర్చూరులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు(చినగంజాం): పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. పర్చూరులోని బీఏఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాలలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు పాఠశాల, కళాశాల విద్యార్థులు, జిల్లా అధికారులతో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బొమ్మల సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ ఆంధ్రప్రదేశ్ సాధించాలనే సంకల్పంతో పర్చూరు నియోజక వర్గంలో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పర్చూరులో పంచాయతీ కార్మికులతో కలెక్టర్ వినోద్ కుమార్ కాఫీ విత్ క్లాప్ మిత్ర నిర్వహించారు. అదేవిధంగా పర్చూరు మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరపలేకపోతున్నామని అధికారులు తెలపడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి తక్షణం చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆర్డీఓ గ్లోరియా, డీపీఓ ప్రభాకరరావు, నియోజక వర్గ ప్రత్యేకాధికారి ఎస్.లవన్న, మార్కెటింగ్ డీఎం కరుణశ్రీ, వ్యవసాయ శాఖాధికారి అన్నపూర్ణ, మార్కెటింగ్ ఏడీ రమేష్ బాబు, డ్వామా పీడీ విజయలక్ష్మి, అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు పాల్గొన్నారు.

జిల్లాలో పుష్కలంగా యూరియా..

బాపట్ల: జిల్లాలో యూరియా పుష్కలంగా ఉందని రైతులు సంతోషంగా యూరియా తీసుకొనివెళ్ల వచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బాపట్ల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 112 మెట్రిక్ టన్నుల యూరియాను 978 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా 114 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

డయేరియా కేసులు @100

- తగ్గుముఖం పట్టని వ్యాధి
- కలుషిత నీరు కాదంటూ కమిషనర్ ప్రకటన
- నీటి వల్లే అంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరులో డయేరియా కేసులు సెంచరీకి చేరువలో ఉన్నాయి. తగ్గుముఖం పట్టకపోగా రోజ రోజుకీ పెరుగుతుండటంతో ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తోంది. శనివారం ఉదయానికి జీజీహెచ్‌లో బాధితుల సంఖ్య 92కు చేరింది. సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా అధికారులు పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారు. కలుషిత నీరు కాదు, కలుషిత ఆహారం వల్లే సమస్య ఏర్పడిందంటూ కమిషనర్ డయేరియా వెలుగు చూసిన రోజే ప్రకటన చేయడం వివాదాస్పదంగా మారింది. జీజీహెచ్ వైద్యులు మాత్రం కలుషిత నీటి వల్లే ఈ సమస్య ఏర్పడిందని స్పష్టంగా చెబుతున్నారు.

బాధితులు సంఖ్య బయటపెట్టని అధికారులు

జీజీహెచ్‌కి వచ్చిన కేసులను కూడా పూర్తిగా బయటపెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రులకు, ఆర్ఎంపీల వద్దకు వెళుతున్న వారు, ఇంటి వద్దనే వైద్యం తీసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలను వెల్లడించకుండా కేసుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతిసార, ఇతర బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బంది సందర్శనలు, స్థానికుల తాగు నీటి వసతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఆనందపేట 3వ లైనులో కాలువ పక్కనే ఉన్న మంచినీటి పైపులైన్లు నగర ప్రజల్లో ఆందోళన

2018లో ఆనందపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఇదే విధంగా డయేరియాతో 30 మంది వరకూ మరణించడంతో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు నగరంలోని 57 డివిజన్లలో పలు ప్రాంతాల్లో ఇంటింటికీ సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లోనే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని మురుగు కాలువను అనుకొని వెళుతున్నాయి. వర్షం కురిస్తే చాలు పొంగి వాటర్ పైపులైన్లన్నీ కూడా మునిగిపోతున్నాయి. పైపుల్లోకి మురుగు నీరు చేరుతుందని నగరంలోని రామిరెడ్డితోట, ఆనందపేట, దుర్గానగర్, యానాదికాలనీ వాసులు చెబుతున్నారు.

రంగు మారిన నది నీరు

నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణానదిలో నీరు కూడా రంగుమారి వస్తోంది. దీన్ని తక్కెళ్ల పాడులో శుద్ధి చేసి నగరానికి తాగునీటిని సరఫరా చేస్తుంటారు. సాధారణ సమయాల్లో వాటర్ టర్బీడిటీ(బురద) 5 శాతంగా ఉన్నా వరదల సమయంలో ఇది 20 శాతానికి పైగానే ఉంటుంది. ఈ సమయంలో నీటిని శుద్ధి చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ దిశగా యంత్రాంగం దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కూడా క్షీణించింది. ప్రతి రోజు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి.

మురికి నీళ్లు వస్తున్నాయి



మా ప్రాంతంలో రెండు రోజుల నుంచి మురికి నీరు సరఫరా అవుతోంది. నీరు కూడా వాసన వస్తోంది. తప్పక వాటినే వాడాల్సిన పరిస్థితి నెలకొంది. తాగు నీటి సరఫరాపై అధికారులు దృష్టి సారించాలి.

– అచ్చమ్మ, దుర్గానగర్(సుద్దపల్లి డొంక)

పైపులైన్లలోకి మురుగునీరు



మా ప్రాంతంలో కాలువల్లో పైపులైన్లు ఉన్నాయి. వాటిని అధికారులు తొలగించకపోవడంతో డ్రైనేజీ వాటర్ పైపుల్లోకి చేరుతోంది. దీని వల్ల విరేచనాలు, వాంతులు, జ్వరాలతో బాధపడుతున్నాం.

– ఎండీ.ఎఫ్. షరీఫ్, ఆనందపేట

యువకుడిపై కత్తితో దాడి

- పరిస్థితి విషమం
- పుట్టిన రోజు వేడుకల్లో శ్రుతిమించిన వివాదం
- ఇరువురిపై కేసు నమోదు

చేబ్రోలు: పుట్టిన రోజు వేడుకల్లో స్వల్ప వివాదం జరిగి ఆవేశంలో కత్తితో దాడి చేయడంతో యువకుడి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన యువకుడు దానబోయిన మురళి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి పార్టీ ఏర్పాటు చేశాడు. డీజే, డాన్స్ , భోజనాలను ఏర్పాటు చేశాడు. నారాకోడూరు, పరిసర గ్రామాలకు చెందిన మురళి మిత్ర బృందం హాజరయ్యారు. డ్యాన్స్ సందర్భంగా అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో యువకుల మధ్య వివాదం రేగింది. దీన్ని మనసులో పెట్టుకొని శ్రీకర్, వరుణ్‌లు వేజండ్ల గ్రామానికి చెందిన తోట గౌతమ్ కృష్ణపై కత్తితో ఛాతీపై పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గౌతమ్ కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధితుడి తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ పి. వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

క్రీడా కోటాలో డీఎస్సీలో ఉద్యోగాలు



క్రీడా కోటాలో డీఎస్సీలో ఉద్యోగం సాధించిన క్రీడాకారులు

జె.పంగులూరు: ఈ ఏడాది ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీలో పోటీ పరీక్షలతో సంబంధం లేకుండా పీఈటీగా ఉద్యోగాలు కల్పించినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మేకల సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సన్మానం ఏర్పాటు చేశారు. గోవాలో జాతీయ క్రీడల్లో పాల్గొని పతకం సాధించిన సందర్భంగా క్రీడాకారులు ప్రతి ఒక్కరికి వ్యాయామ ఉపాధ్యాయునిగా పోస్టులు ఇస్తున్నట్లు తెలిపారు.

డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన క్రీడాకారులు:

పి. శివారెడ్డి (ప్రకాశం), జి. క్రాంతికుమార్ (విశాఖపటణం), ఏ. శివనాగిరెడ్డి (గుంటూరు), వై. సతీష్ (తూర్పు గోదావరి), ఎల్. సురేష్ (విజయనగరం), ఎల్. అప్పలనాయుడు (పశ్చిమగోదావరి), వై. దాలినాయుడు (కృష్ణ), పి. రామ్మోమెహన్ (కడప), ఏ. రాజ్‌కుమార్ (చిత్తూరు).

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

నలభైకి పైగా లఘు చిత్రాల ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఆలపాటి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు – 2026 సన్నాహాల్లో భాగంగా శనివారం కలెక్టర్ బంగ్లా రోడ్ భారతీయ విద్యాభవన్‌లో 'తెలుగు భాషా వికాసం'పై అంతర్జాతీయ లఘు చలన చిత్రోత్సవంలో భాగంగా 44 చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాడారని, ఆయన జీవితం తరతరాలకు స్ఫూర్తి కావాలని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ లలిత కళలు, మన సంస్కృతి గొప్పతనంపై విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో జరిగే మూడో ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సభలో వీవీఐటీ విశ్వవిద్యాలయం కులపతి వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్, నంబర్ వన్ టీవీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, చలనచిత్ర ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డి.వై.చౌదరి, బి.వి.ఎస్. రవి, సిరాశ్రీ, సమన్వయకర్త పి.రామచంద్రరాజు, సినీ, టీవీ, రంగాల రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. అనంతరం గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం దర్శకత్వంలో కృత్రిమ మేధస్సుతో రూపొందించిన తెలుగు వెలుగు గొడుగు గిడుగు లఘు చిత్రం ఆకట్టుకుంది. తెలుగు భాష ప్రాధాన్యతపై నలభైకి పైగా లఘు చిత్రాలను ప్రదర్శించారు.

వెదుళ్లపల్లిలో 'అగ్నివీర్' అంత్యక్రియలు

బాపట్లటౌన్: వ్యక్తిగత కారణాలతో రాజస్థాన్‌లో ఆత్మహత్య చేసుకున్న అగ్నివీర్ మేడిబోయిన వెంకటదుర్గారెడ్డి మృతదేహాన్ని ఆర్మీ అధికారులు శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబసభ్యులు, మాజీ సైనికుల ఆధ్వర్యంలో వెదుళ్లపల్లిలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంధ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో మాజీ సైనికులు వెదుళ్ళపల్లి గ్రామానికి చేరుకొని అగ్నివీర్‌కు పార్థీవదేహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. తాంధ్ర సాంబశివరావు మాట్లాడుతూ అగ్నివీర్‌గా ఉద్యోగంలో చేరి ఒక సంవత్సరం, 10 నెలలు మాత్రమే అయ్యిందన్నారు. క్షణికావేశంలో చిన్నవయస్సులోనే మృతిచెందడం బాధాకరమన్నారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గుణశీలా, సూపరింటెండెంట్ ఆనందరావులు అగ్నివీర్‌కు నివాళులర్పించారు.



అగ్నివీర్ వెంకటదుర్గారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తాంధ్ర సాంబశివరావు

బాపట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుట్ట ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షుడు చలికొండ వెంకటకృష్ణారావు, బాపట్ల జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ షేక్ నిజాముద్దీన్, సీనియర్ మాజీ సైనికుడు కె.ఆంజనేయులు, 23 ఎన్‌సీసీ ఆంధ్ర బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అనారోగ్యం

- మెలియోయిడోసిస్ అనుమానంతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది
- కుటుంబ సభ్యులను పరామర్శించిన డీఎంహెచ్‌ఓ విజయమ్మ

కర్లపాలెం: కర్లపాలెంలో ఓ వృద్ధురాలు గత ఐదు రోజులుగా వాంతులు, కడుపునొప్పితో చికిత్స పొందుతుందని తెలిసి వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపీనాథ్ తెలిపిన వివరాల మేరకు.. కర్లపాలెంలో ఓ వృద్ధురాలు గత ఐదురోజులుగా వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుంది. వృద్ధురాలు అనారోగ్యంతో ఉందని సమాచారం అందుకున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జోనల్ మలేరియా మేనేజర్ వినోద్‌కుమార్ కర్లపాలెంలోని వృద్ధురాలి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు మెడికల్ కళాశాల నుంచి ఆర్ఆర్‌టీ టీం వచ్చి వృద్ధురాలి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల గృహాలలోని వ్యక్తుల రక్త నమూనాలను సేకరించారని తెలిపారు.

ఆందోళన వద్దు..

దీనిపై డీఎంహెచ్‌ఓ విజయమ్మ స్పందిస్తూ.. వృద్ధురాలికి మెలియోయిడోసిస్ లక్షణాలు లేవని ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ముందస్తు చర్యలలో భాగంగా ఆమె కుటుంబ సభ్యులకు, వీరి ఇంటికి వచ్చి వెళ్లేవారికి రక్త పరిక్షలు నిర్వహించామని తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షోభంలో పారిశ్రామిక రంగం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

మార్టూరు: ఇటీవల భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లోప భూయిష్ట విధానాల వల్ల పారిశ్రామిక రంగం సంక్షోభం అంచున ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి అన్నారు. మార్టూరు సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నూలు మిల్లుల నిర్వహణ భారం పెరిగి మార్టూరు, చిలకలూరిపేట ప్రాంతాల నూలు మిల్లుల యాజమాన్యాలు మూసివేత దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గ్రానైట్ యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల రాయితీలను విడుదల చేసి విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీలు పరిశ్రమల్లో ఇటీవల ప్రమాదాల బారిన పడి వలస కార్మికులు మృత్యువాత పడుతున్నారని అందుకు అధికారుల అలసత్వం, నిర్లక్ష్య వైఖరే కారణాలని ఆమె ఆరోపించారు. రైతులకు సకాలంలో ఎరువులను అందించలేని రాష్ట్ర ప్రభుత్వం వీధి వీధినా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. బాపట్ల సీపీఎం కార్యదర్శి సీహెచ్ గంగయ్య, మార్టూరు నాయకులు బత్తుల హనుమంతరావు, ఎనిక పాటి రాంబాబు, బి.సూరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం



చీరాల అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాకు చెందిన ముగ్గురిని పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో కార్యదర్శులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మున్సిపల్ వింగ్ జనరల్ సెక్రటరీగా చీరాలకు చెందిన కీర్తి వెంకట్రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా రేపల్లెకు చెందిన కొప్పుల గోపి, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా వేమూరుకు చెందిన డాక్టర్ సి.రామమోహనరావును నియమించారు.

28న క్లెసా జిల్లా స్థాయి సమావేశం

నరసరావుపేట: కాన్ఫడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డు ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్కిటెక్ట్స్ ఆఫ్ పల్నాడు (క్లెసా – పల్నాడు) జిల్లా నూతన కార్యవర్గం ఈ నెల 28వ తేదీన పెద్దచెరువులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో సమావేశం కానుందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.కమలాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘంలో చేరి అభివృద్ధి కోసం కృషి చేయాలనే ఉద్దేశంతో ఉన్న వారందరూ హాజరుకావాలని కోరారు. రాష్ట్ర నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొని భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు. జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఉంటుందన్నారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

తాడికొండ: బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్.వాసు శనివారం తెలిపారు. తాడికొండకు చెందిన యువతి గుంటూరులోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గత పది నెలలుగా తాడికొండ గ్రామానికి చెందిన షేక్ అస్లామ్ యువతి కళాశాలకు వెళుతున్న సమయంలో వెంటబడుతున్నాడు. తనను ప్రేమించాలంటూ బలవంతం చేస్తూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. యువతి విషయాన్ని కుటుంబ సభ్యలకు తెలిపింది. ఆమె తాతయ్య నిందితుడిని హెచ్చరించాడు. రెచ్చిపోయిన యువకుడు ఫోన్ చేసి తన ప్రేమ ను అంగీకరించకపోతే యువతితో పాటు ఆయ న్ను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

పార్క్ చేసిన బుల్లెట్ చోరీ



చీరాల అర్బన్: స్థానిక దర్బార్ రోడ్డులోని ఓ షాపు ఎదుట పార్క్ చేసిన బుల్లెట్ బైక్‌ను శుక్రవారం రాత్రి దుండగులు అపహరించుకెళ్లారు. దుండగులు బైక్ హ్యాండిల్‌ను కాలుతో తన్ని లాక్ తీశారు. బైక్ స్టార్ట్ చేసుకొని దర్జాగా వెళ్లిపోయారు. చోరీ దృశ్యాలు షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి. శనివారం బుల్లెట్ బైక్ కనిపించకపోవడంతో వాహనదారుడు సీసీ కెమెరాలలో చూసి చీరాల ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

కారు, బైక్ ఢీ.. ఒకరు మృతి



మరొకరికి తీవ్ర గాయాలు

కారంచేడు: ఎదురెదురుగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం సాయంత్రం చీరాల–స్వర్ణ దండుబాట రోడ్డులో స్వర్ణ సమీపంలోని టపాసుల గోదాముల వద్ద జరిగింది. కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అందించిన సమాచారం మేరకు.. జె. పంగులూరు గ్రామానికి చెందిన కొమరాబత్తిన శ్రీనివాసరావు (50) చీరాల నుంచి స్వర్ణ మీదుగా ప్రస్తుతం ఆయన నివాసం ఉంటున్న ఇంకొల్లు మండలం గంగారానికి బయలుదేరారు. కాగా మార్గమధ్యంలో జోరుగా వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో స్వర్ణ వైపు నుంచి చీరాలకు వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో ద్విచక్రవాహనం నడుపుతున్న శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా పోటీలకు ఎంపికైన కొత్తపేట విద్యార్థులు

వేటపాలెం: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గుమ్మా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం జరిగిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొని విజేతలగా నిలిచారని తెలిపారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులు డిస్కస్‌త్రోలో ప్రసాద్, 5కే నడకలో సుర్యతేజ, డిస్కస్ త్రోలో జయచంద్రిక, 200 మీటర్ల పరుగు పందెంలో వెంకాయమ్మ, 400 మీటర్లు పరుగు పందెంలో రేఖ విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కఠారివారిపాలెం స్కూల్ విద్యార్థి ఎస్. రాహుల్ జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మావతి తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మండల కేంద్రంలో శనివారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం వెలుగు చూసింది. స్థానికులు పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొణిదెన రోడ్డులో వైన్స్ షాపుల సమీపంలోని చెట్ల కింద పురుషుని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు వీఆర్వో మోహన్ రావు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండవచ్చని మద్యంలో గడ్డి మందు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుడి చేతికి రాఖీ, ఎడమ చేతికి గోల్డ్ కలర్ వాచ్ ఉంది. రెండు రోజుల క్రితం చనిపోయినట్లు భావిస్తున్న మృతదేహాన్ని మార్టూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి భద్రపరిచారు.

పిడుగురాళ్లలో 43 మందిపై కేసు

పిడుగురాళ్ల: చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల మెడికల్ కళాశాల వద్దకు వెళ్లిన 43 మందికి పైగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పిడుగురాళ్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. ముందస్తు జాగ్రత్తలలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలప్పుడు లా అండ్ ఆర్డర్ ఇబ్బంది లేకుండా వారిని అదుపులోకి తీసుకొని, సొంత పూచీకత్తుపై పంపించినట్లు పోలీసులు తెలిపారు.

శలపాడులో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న ఏఓ ప్రియదర్శిని తదితరులు

సాక్షి ఎఫెక్ట్

చేబ్రోలు: భారీ వర్షాలు, వరదలకు మండలంలోని శలపాడు, వీరనాయకుని పాలెం గ్రామాల్లో నీట మునిగి దెబ్బతిన్న వరి పొలాలను శనివారం వ్యవసాయశాఖాధికారులు పరిశీలించారు. సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన ''రెక్కల కష్టం... వర్షార్పణం'' కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక ఏవో పి. ప్రియదర్శిని మాట్లాడుతూ శేకూరు, శలపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులు నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేశారని తెలిపారు. పంట కూడా 30రోజులు పైబడిన దశలో ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉన్న పొలాలను పరిశీలించామని, ప్రాథమిక నివేదికను జిల్లా వ్యవసాయశాఖాధికారికి సమర్పించినట్లు తెలిపారు. వ్యయసాయశాఖ సిబ్బంది, మైలా రామరాజు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ జిల్లా టీం ఎంపిక



గుంటూరు వెస్ట్: బీఆర్ స్టేడియంలో శనివారం అండర్– 14, అండర్– 17, అండర్– 19 జిమ్నాస్టిక్స్ బాలబాలికల జిల్లా టీం సెలక్షన్లు నిర్వహించారు. అండర్–14, 17 ఎంపికలు ఎస్జీఎఫ్ సెక్రటరీ గోపి, అండర్ –19 ఎంపికలు నరసింహారావు, కోచ్ అఫ్రోజ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగాయి.